# ఏది గొలుసు కథ

—చెళ్లూరి సీతారాజేశ్వర రావు



బంధువుల ప్రసక్తి ఎప్పుడు వచ్చినా విశాలాక్షి 'మా యింజనీరు మావయ్య' అంటూ సుదీర్ఘోపన్యాసం యిస్తుంది. ఇది మొగుడైన గుర్నాథానికి, యిరుగు పొరుగు అమ్మలక్కలకి తెల్సు. విశాలాక్షి ఏంచెప్పినా అందరూ శ్రద్ధగా వింటారు. ఎందుకంటే ఆమెనోరు ప్రత్యేకమైన మహాత్మ్యం కలది. వినకపోతే విశాలాక్షి మొగుడికి అప్పడాలకర్ర, యితరులకి కత్తిలేని తెలుగు తిట్ల విందు రుచి చూపిస్తుంది. ఈ బాధల కంటే ఆమె చెప్పినది వింటే ఏంపోయె!

ఆ రోజు విశాలాక్షి కోటిలింగాల రేవులో స్నానం చేస్తుంటే దూరపు

చుట్టం గంగమ్మ 'వచ్చే శనివారం మీ ఇంజనీరు మామయ్య కొడుకు పెళ్ళట అని చెవిన పడేసింది. అపట్నుంచి విశాలాక్షి శుభలేఖకోసం పోస్టుమన్‌కి ఎదురు వెళ్ళసాగింది. శుక్రవార మొచ్చినా శుభలేఖ రాలేదు. తను గొప్పగా వ్రాసిన కథ తిరిగివచ్చిన రచయితలా, బాక్సాఫీసు తారాగణంతో నవరసాల మసాలాతో తీసిన సిన్మా పల్టీకొట్టిన ప్రొడ్యూసర్‌లా విశాలాక్షి ఘొల్లుమంది.

"నడవండి బెజవాడ". మొగుడ్ని లేవదీసింది.

గుర్నాధానికి ఎందుకు అని అడిగే ధైర్యంలేదు. బాపూ కార్టూన్‌లా నవ్వి "ఏమిటి విశేషం? నేను వినద్చా" అనడిగాడు.

విశాలాక్షి తనబట్టలు సర్దుతూనే పెళ్ళి సంగతి చెప్పింది. విశాలాక్షి మూడ్ బాగుందని "శుభలేఖ రాలేదు కదూ." అనడిగాడు.

"మామయ్య వేసేవుంటాడు. ఈ పోస్టువాళ్ళు ఎవరికిచ్చారో? ఈ వూరు నిండా గుర్నాధాలే."

గుర్నాధానికి కాదనడానికి కారణాలు కనిపించలేదు. తనకి సెలవు లేదని చెప్పడానికి వీల్లేదు. తను చేస్తున్నది ముక్కుపొడుం వ్యాపారం. ఎక్కడికైనా వెళ్ళడానికి ఎవర్నీ అడగక్కర్లేదు పెళ్ళాందీవనలు అందుకోకుండా బయలు దేరాడు.

గుర్నాధం కుటుంబం విజయవాడ చేరుకుంది.

ఇంజనీరు మామయ్య చూశాడు. విశాలాక్షి వచ్చేస్తుందనే ఆయన శుభలేఖ వెయ్యలేదు. పేలవంగా నవ్వి శుభలేఖ అందిందా? మావాడు అడ్రస్ ఏదోతప్పు వ్రాశాట్ట." సమర్థంగా అన్నాడు మర్యాద దక్కించుకుందుకు.

విశాలాక్షి మందహాసం చేసింది. 'పిలుపులూ, మర్యాదలు దూరం వాళ్ళకి మామయ్యా' అని లోపల కెళ్ళింది, తాను మరింత దగ్గరదాన్నని స్పష్టంచేసి.

రాత్రే లగ్నం. యిల్లంతా సందడిగా వుంది. విశాలాక్షి అందర్నీ పలకరిస్తూ గాడిపొయ్యి దగ్గరకెళ్ళి వంటవాళ్ళచేత స్ట్రాంగ్‌గా కాఫీపెట్టించుకొని త్రాగింది. యింకా మిగిలింది కాఫీ. అప్పుడు మొగుడు గుర్తువచ్చాడు. కాఫీగ్లాసుతో పందిట్లోకి వెళ్ళింది. గుర్నాధం ముక్కుపొడుంమీద సుదీర్ఘోపన్యాసాలు యిస్తున్నాడు. పెళ్ళాం దర్శనం ఎయిర్ బ్రేక్.

మొత్తానికి విందులతో వినోదాలతో తగవులతో పెళ్ళయిపోయింది.

"నా నెక్లెసు పోయింది మామయ్యా" విశాలాక్షి ఘొల్లుమంది. నలుగురూ చుట్టూ మూగారు. ప్రశ్నలు, సలహాలు. వివరాలు సూచనలు, అనుభవాలు.

"పెళ్ళికొచ్చి ఆరు వందల నగ పోగొట్టుకున్నాను రోయ్... ఇక్కడంతా

దొంగలు దాపురించార్రోయ్.. మామయ్యా పోలీసుల్ని పిలు... దొంగని వాళ్లే పట్టుకుంటారు."

పెళ్లింటికి పోలీసులు రావడం, అయిన వాళ్లని అవమానించడం కాకోక ఇంజనీరు మామయ్య నగ ధర తాను యిస్తానన్నాడు. వెళ్లేటప్పుడు యిచ్చాడుకూడ

"నీకు నెక్లెసు ఎక్కడిదే? రైలు ఎక్కాక గుర్నాథం అడిగాడు.

"మామయ్య రెండుచేతులా సంపాదిస్తున్నాడు. మనకి ఏదైనా సాయం చెయ్యమంటే చేస్తాడా? అందుకే నాటకం ఆడాను. మామయ్యకు టోపీ వేశాను."

సరిగ్గా ఏడాదికి శుభలేఖ అందుకొని యింజనీరు మామయ్య కూతురు పెళ్లికి వెళ్లింది విశాలాక్షి. పెళ్లయాక 'నా గొలుసు పోయింది మామయ్యా' అంది. రాగం తీసింది.

"జిగినీగొలుసు కదూ. నిన్న వేసుకున్నదేనా?"

"అవును మామయ్యా. కాని ఏడాది కాలేదు. రెండువేల నగ" డబ్బున్న వాళ్ల పరువు ఖరీదు కట్టడంలో విశాలాక్షి నేర్పరి.

"ఇంజనీరుమామయ్య గొలుసు యిస్తూ "ఇదేమో చూడమ్మా. మేడమెట్లదగ్గర వుంది..."అన్నాడు.

"నాదే మామయ్యా......అదృష్టం, నీకు దొరికింది."

విశాలాక్షి నవ్వి మెడలో వేసుకొంది 'నాదేనంటూ'. ప్రయాణమవడానికి లోపలికెళ్లింది ఈసారికూడ నాటకం ఫలించింది. డబ్బుకుబదులు నగ దొరికింది.

తాయారమ్మ మేడదిగి వస్తూ 'విశాలా' నా గొలుసు నీకెలా వచ్చిందే.' అడిగింది. విశాలాక్షి కంగారుపడి, 'నాదే' నని బొంకింది.

"అబద్ధమాడగానే సరిగాదు. లాకెట్టులో నా ఫోటోవుంది. కొక్కెంమీద నా పేరు వుంది." తాయారమ్మ గొలుసు తీసి నలుగురికీ చూపించింది ఆమె చెప్పినట్లు ఫోటో, పేరూ వున్నాయి

"నీదేనన్నావు కదా!" ఇంజనీరు మామయ్య నిలేశాడు.

విశాలాక్షి శిలావిగ్రహమై పోయింది. చచ్చే అవమానం. నలుగురి చూపులు ఆమెమీదే వున్నాయి. ఎవరికి తోచినట్లు వాళ్లు తిడుతున్నారు.

"నిన్ను పట్టుకోడానికే ఈ పథకం వేశాను. ఈసారి మా యింటికి వచ్చేటప్పుడు మొదటే నీ నగలు మాకు చూపించు. పోకుండా కట్టడిచేస్తాం. అయినా అంతా నీలాగ దొంగతనాలు చెయ్యరు......ఎంత తెలివిగా చేసినా బొల్తాపడక మానవ్" ఇంజనీరు మామయ్య చివాట్లు వేశాడు.

ఆ రోజునుంచి యింజినీరు మామయ్య ప్రస్తావన తేలేదు విశాలాక్షి.